క్లుప్తంగా

ఘనంగా సిక్కుల బైసాఖి వేడుకలు



గురుద్వారా సాధు సంగత్‌లో ప్రార్థనలు చేస్తున్న సిక్కులు

సీతమ్మధార: సిక్కుల ప్రధాన పండగ బైసాఖి (వైశాఖి) వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇదే రోజున సిక్కు గురువు గురుగోబింద్ సింగ్ ఖల్సా స్థాపించిన సందర్భంగా సిక్కులు నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. గురుద్వారా జంక్షన్‌లోని గురుద్వారా సాధు సంగత్‌లో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. సాధు సంగత్ అధ్యక్షుడు ఆనంద్ సిక్కు గురువుల బోధనలను ఉపదేశించారు. సిక్కులు సంప్రదాయ దుస్తుల్లో గురుద్వారాను దర్శించుకుని ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, సిక్కు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

జనచైతన్య మండలి పాటల సీడీ ఆవిష్కరణ

సీతంపేట: జనచైతన్య మండలి నలభై ఏళ్ల ఉద్యమ ప్రస్థానం, బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం అంబేడ్కర్ బౌద్ధ చైతన్య భావజాల గీతాల సీడీ ఆవిష్కరణ జరిగింది. సంస్థ వ్యవస్థాపకుడు పెయ్యల పావనప్రసాద్ రాసిన గీతాలకు సంగీత దర్శకుడు జాన్ సంగీతాన్ని సమకూర్చారు. సీడీలో 16 పాటలను పలు సంఘాల నాయకులు ఆవిష్కరించారు. పి.రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హుదూదూరు సీతామహాలక్ష్మి, దళిత హక్కుల సమాఖ్య అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ, రచయిత బండి సత్యనారాయణ, దళిత సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి బూసి వెంకటరావు, పలు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

మద్రిపాలెం: నిర్మాణం జరుగుతున్న ఇంటి శ్లాబ్ పరంజాకు ఉరివేసుకుని ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తెన్నేటినగర్‌లోని చిన్న కుమార్తె ఇంటికి వెళ్లిన బుదిరెడ్డి సత్యం (63) ఈ నెల 12వ తేదీ శుక్రవారం రాత్రి 11.30 గంటల సమయంలో మేడ మీద శ్లాబ్ పరంజాకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కాగితాలు ఏరుకుంటూ జీవిస్తూ అదే ప్రాంతంలో నివసిస్తున్నాడు. ఇతడికి మద్యం తాగే అలవాటు ఉంది. పెద్ద కుమార్తె డి.వెంకటలక్ష్మి శనివారం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ ప్రసాద్

సీతమ్మధార: వాహన చోదకులందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లు వాహనాలు నడపరాదని ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ కె.ఎస్.ఎస్.వి.ప్రసాద్ తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు శనివారం ద్వారకానగర్‌లోని ఎసెంట్ కళాశాలలో ×భద్రత× అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్, సైబర్ క్రైంలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదన్నారు. 18 ఏళ్లు నిండిన తరువాత లైసెన్స్ తీసుకుని వాహనాలు నడపాలని సూచించారు. టూ వీలర్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, సిగ్నల్ పాయింట్ వద్ద రెడ్ లైట్ వెలిగినప్పుడు ఆగాలని, గ్రీన్ లైట్ వెలిగినప్పుడు ముందుకు వెళ్లాలని సూచించారు. రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆన్‌లైన్ మోసాల గురించి వివరించారు. బ్యాంకు అధికారులమని చెప్పి ఫోన్ కాల్స్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పరాదని, బ్యాంకు అధికారులు ఎవరూ ఫోన్ చేసి వివరాలు అడగరన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.వి.భాస్కరరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుపరిపాలనను గెలిపించండి

- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం



53వ వార్డులో మహిళలకు నమస్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

మద్రిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా అందించిన సుపరిపాలనను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ 53వ వార్డు శివనగర్, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో శనివారం ఉదయం కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలు ఆయనకు అడుగడుగునా ఆత్మీయ స్వాగతం పలికారు. ఆయా ప్రాంతాల్లోని మహిళలు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పూర్తి మద్దతిస్తామన్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తమకు మంచి ఆదరణ లభించిందన్నారు. ఈ ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమం ఏ విధంగా అందించారో ప్రజలకు గుర్తు చేసి మద్దతివ్వాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తన గెలుపునకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ 53వ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, డైరెక్టర్లు బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, రాయుడు శ్రీను, షేక్ బాబ్జి, హనుమంతు, పైడిరాజు, పట్నాల కనకరాజు, సదరం జ్ఞానేష్, సంపత్, రామలక్ష్మి, ఝాన్సీ, జ్యోత్స్న, జయ, సుశీల, సీనియర్ నాయకులు సునీల్, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

కె.కె.రాజును గెలిపిద్దాం



46వ వార్డు శాంతినగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: 'వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు ఓటు వేద్దాం.. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూద్దాం' అనే నినాదంతో శనివారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 46వ వార్డు శాంతినగర్, మధుసూదన్‌నగర్ కొండవాలు ప్రాంతాల్లో ఆయన ఆధ్వర్యంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కటుమూరి సతీష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ విజయాన్ని చేకూర్చాలని ప్రజలను అభ్యర్థించారు. వారితోనే విశాఖ, ఉత్తర నియోజకవర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఇంటింటా ఓటు అభ్యర్థిస్తూ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచిని చూసి ఓటేయండి



50వ వార్డులో కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు నరసింహనగర్ లో శనివారం కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన మంచి పాలన, అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జగనన్న బలపరిచిన ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాలనీకి సంబంధించి మౌలిక వసతుల అభివృద్ధి జరగడానికి కారణం కె.కె.రాజు అని, ఆయన చొరవతోనే విస్తృత స్థాయిలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయగలిగామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



క్రైస్తవ సేవకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- మద్దతు తెలిపిన క్రైస్తవ సేవకులు, నాయకులు

మద్రిపాలెం: ఉత్తర నియోజకవర్గ క్రైస్తవ సేవకులు, నాయకులు వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు మద్దతు ప్రకటిస్తూ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 51వ వార్డు 48 లాస్ట్ బస్‌స్టాప్ దరి గ్రాండ్ మిలాన్ ఫంక్షన్ హాల్‌లో రెవరెండ్ పాల్ విక్టర్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె.కె.రాజు హాజరై మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తోందని, పాస్టర్లకు గౌరవ వేతనం ఇచ్చిందని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందిందని, ఇప్పుడు ఆయన వారసుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా అదే బాటలో ఉత్తరాంధ్రను మరింత అభివృద్ధి చేసి చూపించారన్నారు. సీఎం సహకారంతో ఉత్తర నియోజకవర్గంలో రూ.394 కోట్లతో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. అనంతరం బిషప్ ఎంఆర్ జేమ్స్ వ్యాకోపదేశం చేశారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, కో ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, బిషప్ ఎల్.శామ్యూల్, అనిల్‌పాల్, జేమ్స్, మాథ్యూస్, జార్జ్, పద్మాకుమార్, పాస్టర్ ప్రభాకర్, క్రైస్తవ మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరిస్తా..



లక్ష్మీనారాయణపురం–2లో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు లక్ష్మీనారాయణపురం–2లో స్థానిక నాయకుడు దొరబాబు ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు దృష్టికి స్థానిక సమస్యలను తీసుకువెళ్లారు. వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని, రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని స్థానికులను కె.కె.రాజు కోరారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, వార్డు నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

కొండవాలు ప్రజలకు అండగా ఉంటా..



48వ వార్డు ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

కంచరపాలెం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుని, ప్రజలకు అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు హామీ ఇచ్చారు. జీవీఎంసీ 48వ వార్డు న్యూ శ్రీనివాస్‌నగర్ వెల్ఫేర్ అసోయేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వార్డు పార్టీ శ్రేణులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మురికివాడలు అభివృద్ధి చెందడంతోపాటుగా కొండవాలు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. ఎన్నికల్లో విజయ కేతనం ఎగురవేసి రెట్టింపు ఉత్సాహంతో తిరిగి ప్రజా సంక్షేమాన్ని కొనసాగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును రానున్న ఎన్నికల్లో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కాయల సూరారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నీలి రవి, పార్టీ సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, వసంతల అప్పారావు, సుబ్బిరెడ్డి, గంగరాజు, శ్రీను, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, గ్రామపెద్దలు గృహసారథులు పాల్గొన్నారు.

మహోదాత్త మహిళ సీతాదేవి



ప్రవచిస్తున్న ఆచార్య మలయవాసిని

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న సీతారామ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం రామాయణ ప్రవచనాలు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం పీఠం దర్బారు హాల్‌లో విశాఖ సాహితి అధ్యక్షులు ఆచార్య కోలవెన్ను మలయవాసిని రామాయణంలోని సీతాదేవి పాత్రపై ప్రవచనం చేశారు. సీతాదేవి మహోదాత్త మహిళని, రావణ సంహారం కోసమే ఆమె జననం జరిగిందని, సీతారాముల దాంపత్యం లోకానికి ఆదర్శప్రాయమన్నారు. వాల్మీకి చిత్రించిన సీతాదేవి పాత్రలోని భిన్న కోణాలను ఆవిష్కరించారు. విశ్వనాథ సత్యనారాయణ రచించిన రామాయణ కల్పవృక్షంలోని పద్యాలను ఉదహరిస్తూ ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకునేలా సాగింది. కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, కందాల కనకమహాలక్ష్మి, రాంభట్ల నృసింహశర్మ, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'శ్రీవిశ్వ' ప్రతిభ



దంగేటి పల్లవి



గుదే ఆదిశేషు



వినయ్‌కుమార్

సీతంపేట: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో శ్రీవిశ్వ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో గుదే ఆదిశేషు, దంగేటి పల్లవి 466/470 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు. ధర్మాన జయాదిత్య మునీంద్ర, ఎం.జాహ్నవి 465 మార్కులు సాధించారు. ఎంపీసీలో 84 మంది 460కి పైగా మార్కులు, 296 మంది 450కి పైగా మార్కులు సాధించారు. ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో గనిశెట్టి వినయ్‌కుమార్ 987/1000 మార్కులు, రెడ్డి యువరాజు, జాగారపు శ్రావ్యలకు 986, పి.భరత్‌కుమార్ 985, జామి విష్ణుప్రియ, ఎస్.సాహిత, ఎ.చరణ్‌తేజ 984 మార్కులు, 22 మంది 980కి పైగా మార్కులు, 86 మంది 970కి పైగా మార్కులు సాధించడం విశేషం. వీరిని శ్రీవిశ్వ విద్యా సంస్థల చైర్మన్ ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ అభినందించారు.

కార్పొరేట్‌కు దీటుగా ఉత్తమ ఫలితాలు



ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో నవోదయ కళాశాల సెక్రటరీ భీశెట్టి రాము

సీతమ్మధార: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో విశాఖపట్నం నవోదయ జూనియర్ కళాశాల విద్యార్థులు కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ చూపారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ భీశెట్టి రాము తెలిపారు. గురుద్వారా దరి నవోదయ కళాశాలలో శనివారం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో టి.స్వాతిక 984, జె.రాణిరెడ్డి 979, భరత్ 976 మార్కులు.. బైపీసీలో పి.మేనక 980, కె.కృష్ణ భవాని 978 మార్కులు సాధించారని తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో కె.సత్యసాయి ప్రసాద్ 458, యు.లావణ్య 457 మార్కులు.. బైపీసీలో బి.హేమ మాధురి 431, ఎం.ప్రవల్లిక 428, ఎస్.ప్రేమకుమారి 426 మార్కులు సాధించినట్లు చెప్పారు. తమ నిపుణులైన అధ్యాపక బృందం నిబద్ధత వల్లే ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సెక్రటరీ, కరస్పాండెంట్ భీశెట్టి రాము, డీన్ మురళీప్రసాద్, భీశెట్టి విశ్వకీర్తి, బి.భవాని, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలు అందజేసి, మిఠాయిలు తినిపించి అభినందించారు.

ఉత్తమ విద్యార్థులకు అభినందన

విశాఖ విద్య: విద్యార్థులు చదువులో రాణించేలా తోడ్పాటు అందిస్తున్నట్లు బీవీకే జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచంట రమ తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను శనివారం ఆమె అభినందించారు. తమ కాలేజీ ఫస్టియర్ 48.63 శాతం, సెకండియర్ 60.58 శాతం సాధించటంతోపాటు పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారన్నారు. ఫస్టియర్‌లో సాజ్ రుస్నీసా(ఎంపీసీ) 441 మార్కులు, సెకండియర్‌లో కోరాడ షర్మిల(ఎంపీసీ) 915 మార్కులతో కాలేజీ టాపర్స్‌గా నిలిచారని చెప్పారు. అధ్యాపకులందరి సమన్వయంతోనే ఇది సాధ్యమైందన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఎల్‌టీ ఒకేషనల్ కోర్సులను నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ రమ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి జనసేన నాయకులు



ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సమక్షంలో పార్టీలో చేరిన జనసేన నాయకులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధారకు చెందిన జనసేన పార్టీ నాయకుడు మాదేటి సురేష్ ఆధ్వర్యంలో 100 మంది ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో వీరిని కె.కె.రాజు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఇస్తామని కె.కె.రాజు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తీసుకెళ్లండి

- కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



మాట్లాడుతున్న ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు విజ్ఞప్తి చేశారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం కార్పొరేటర్లు, పార్టీ మండల అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, వార్డు పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని, ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీకి విజయాన్నందించాలని కోరారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ చల్లా రజని, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, జేసీఎస్ కో ఆర్డినేటర్, మండల అధ్యక్షులు, కన్వీనర్లు, పార్టీ పరిశీలకులు పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షురాలు లలితారెడ్డి

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని వాకర్స్ డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ టి.రంగారావు అన్నారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. మహిళలు నిర్వహించే కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి మాట్లాడుతూ క్లబ్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. క్లబ్ కార్యదర్శి సీహెచ్ లక్ష్మి మార్చిలో జరిగిన కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ఈ నెలలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న సభ్యులకు గవర్నర్ టి.రంగారావు చేతుల మీదుగా కానుకలు అందించారు. మహిళలు వేసవి శిక్షణలో తయారు చేసిన జ్యూట్ బ్యాగులు, పెన్సిల్ పౌచెస్‌ను ప్రదర్శించారు. వేసవి శిక్షణ తరగతులకు సహకరించిన కె.గుణను సత్కరించారు. జిల్లా క్యాబినెట్ కార్యదర్శి బి.సత్యనారాయణ, క్లబ్ కోశాధికారి పి.కమల పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు



బహుమతి అందిస్తున్న ప్రొఫెసర్ అర్జున్, వెంకటరమణ, ప్రసాద్

మద్రిపాలెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శ్రీ సింహాద్రి అప్పన్న ప్రచార సమైక్య వ్యవస్థాపకుడు సనపల నారాయణ స్వామి ఆధ్వర్యంలో శనివారం మాధవధార వుడా కాలనీలోని బాయ్స్ హాస్టల్–3లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఆంధ్ర యూనివర్సిటీ ఆచార్యుడు(ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రొఫెసర్ అసోసియేషన్ అధ్యక్షుడు) పీతల అర్జున్, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, వావిలపల్లి ప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాణ కర్తగా ఉండటం వల్ల నేడు దేశంలో దళితులు, బీసీలు, అట్టడుగు వర్గాల నుంచి అభివృద్ధి పథంలో ముందున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యార్థులకు అనేక రంగాల్లో రిజర్వేషన్లు కల్పించారని, పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, సింహాద్రి అప్పన్న ప్రచార సమైక్య సభ్యులు సనపల ధనంజయస్వామి, ఎస్.రవికుమార్, పాతపట్నం రామ్మోహన్, కరిమిరెడ్డి శ్యామ్ పాల్గొన్నారు.

వైభవుడికి విశేష పూజలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అక్రమ రవాణా బాధితులను ఆదుకోండి



మాట్లాడుతున్న సంస్థ అధ్యక్షురాలు అపూర్వ

సీతంపేట: రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో అక్రమ రవాణా బాధితులు, సెక్స్ వర్కర్ల సమస్యలు, డిమాండ్లను పరిగణలోనికి తీసుకోకపోతే నోటా ఎంచుకుంటామని అక్రమ రవాణా బాధిత మహిళల ఫోరం స్పష్టం చేసింది. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగిన సమావేశంలో అక్రమ రవాణా బాధితులు, సెక్స్ వర్కర్స్ రాష్ట్ర సమాఖ్య విముక్తి సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.అపూర్వ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం 2022 నాటికి రాష్ట్రంలో సుమారు 1.40 లక్షల మంది వ్యభిచారంలో ఉన్నారని, ఏటా 10 నుంచి 15 శాతం మంది ఈ వృత్తిలోకి వస్తున్నారని తెలిపారు. అక్రమ రవాణా బాధిత మహిళలు, సెక్స్ వర్కర్లను ఆదుకోవాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. విముక్తి రాష్ట్ర కార్యదర్శి పుష్ప మాట్లాడుతూ వృత్తితో సంబంధం లేకుండా ప్రతి వ్యక్తి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం గౌరవప్రదంగా జీవించే హక్కు ఉందన్నారు. విముక్తి రాష్ట్ర నాయకురాలు శాంతి మాట్లాడుతూ బాధితులకు పునరావాసం, విద్య, 40 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. సమావేశంలో బీవీఎఫ్ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు, హెల్ప్ సంస్థ కార్యదర్శి రామ్మోహన్, ప్రోగ్రాం డైరెక్టర్ వి.భాస్కరరావు పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీలకు ఆహ్వానం



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజశేఖర్

సీతంపేట: మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు మహమ్మద్ షకీల్ సారథ్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ నెల 27, 28 తేదీల్లో ఉదయం 9 నుంచి రాత్రి 7.30 గంటల వరకు సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. శనివారం పౌర గ్రంథాలయంలో పోటీల పోస్టర్‌ను ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ నెల 29న అంతర్జాతీయ నృత్యప్రదర్శన దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రీయ, జానపద నృత్యం, సినీ గీతాలాపన, సంగీత పరికరాల వాద్యం, డ్రాయింగ్, పెయింటింగ్, చిన్నపిల్లలకు విచిత్ర వేషధారణ, పెద్దలకు వస్త్రాలంకరణ వంటి పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు మహమ్మద్ షకీల్ తెలిపారు. పాల్గొన దలచిన వారు ఈ నెల 25లోగా వాట్సాప్ నంబర్ 99664 85335లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీల విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు ప్రసంశాపత్రాలు అందజేస్తామన్నారు.